


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 268 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా మంగళవారం 4 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 268 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, TUE 4 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు.. దేశంలోనే కొత్త రికార్డ్!

- మూడేళ్ల లోపే ఈ మైలురాయిని అందుకున్న ఆసుపత్రి
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో దేశంలోనే ఇదొక కొత్త బెంచ్‌మార్క్
- 90 శాతం సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ఉచితంగా నిర్వహణ
- నిమ్స్ బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర



**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది. ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ,

- మిగతా 2లో



"మిస్టర్ డ్రామారావు"

## అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత

- మిగతా 2లో

## మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో తీర్పు.. నిర్దోషిగా బ్రిజ్ భూషణ్



- మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌కు ఊరట
- ఆయన్ను నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు
- సహ నిందితుడు వినోద్ తోమర్‌కు కూడా క్లీన్ చిట్
- గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చిందన్న బ్రిజ్ భూషణ్

- మిగతా 2లో

## కర్ణాటక కేబినెట్ విస్తరణ: చివరి నిమిషంలో మార్పులతో కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు

- కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి
- చివరి నిమిషంలో జాబితా నుంచి మంకాల్ వైద్య పేరు తొలగింపు
- సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు
- పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం

- మిగతా 2లో



## బీజేపీకి భారీ షాక్.. బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

- 19,324 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపు
- మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానం కైవసం
- ఎన్నికల బరిలో తొలి విజయాన్ని అందుకున్న జన సురాజ్ పార్టీ

**పెన్ పవర్ డెస్క్:** ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన

- మిగతా 2లో





టీటీడీ ఆసుపత్రుల్లో మందుల కొనుగోళ్లలో

# భారీ అవినీతి

### లోకేశ్‌పై భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

- ఏపీలో అవినీతి తీవ్ర స్థాయికి చేరిందన్న భూమన
- టీటీడీని కూడా వదలకుండా పీడిస్తున్నారని ఆరోపణ
- ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారన్న భూమన

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి తీవ్ర స్థాయికి చేరుకుందని వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ అవినీతిలో మంత్రి నారా లోకేశ్ పాత్ర స్పష్టంగా ఉందని ఆరోపించారు. తిరుపతిలోని ప్రసిద్ధ స్విమ్స్, బర్డ్స్ ఆసుపత్రుల్లో ప్రాణరక్షక మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. పవిత్రమైన ధార్మిక సంస్థ అయిన టీటీడీని కూడా వదిలిపెట్టకుండా ఇష్టమొచ్చినట్లు పట్టి పీడిస్తున్నారని ధ్వజమెత్తారు. శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరాల నుంచి పెద్ద పెద్ద యంత్రాల టెండర్ల వరకు తీవ్రస్థాయిలో గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారని, కంపెనీలతో ముందే లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, తక్కువ ధరకు లభించే పరికరాలను టీటీడీకి ఎక్కువ ధరకు అమ్ముతూ సొమ్ము

- మిగతా 2లో

## రవాణా శాఖలో అనవసర నిబంధనలు

# తొలగించండి

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ

**పెన్ పవర్ డెస్క్:** రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను



అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక

- మిగతా 2లో



## డీల్ కుదుర్చుకోండి.. లేదా లొంగిపోండి

**పెన్ పవర్ డెస్క్:** ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చు కోవాలని లేదా పూర్తిగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ద్వంద్వ వైఖరిని అవలింబిస్తోందన్నారు. " ఆ దేశ నాయకులు మాతో చర్చలు కావాలని కోరుతున్నారు. కానీ బహిరంగంగా నిరాకరి స్తున్నట్లు చెబుతున్నారు. మరోవైపు హర్మూజ్‌ను తామే నిర్వహిస్తున్నామని చెబుతున్నారు. ఆ జలసంధి పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉంది. మేము కోరుకుంటే

- మిగతా 2లో



## 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ' పనుల్లో వేగం పెంచండి

**పెన్ పవర్ డెస్క్:** తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం మరింత పెరగాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఎంత వరకు పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు?

- మిగతా 2లో

## కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసు: మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగారం

- కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసులో సీబీఐ విచారణ
- 9 ఏళ్ల క్రితం కాంట్రాక్టర్ నుంచి రూ. 50,000 లంచం డిమాండ్ చేసిన వైనం
- రూ. 25,000 తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సీబీఐ అధికారులు
- మాజీ ఏజీఎం శ్రీనివాసన్‌కు జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధించిన కోర్టు

- మిగతా 2లో




## రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

- రైజింగ్ రాయలసీమ కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్
- ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది సీఎంలు వచ్చారని వ్యాఖ్య
- రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:** కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజింగ్ రాయలసీమ' కార్యక్రమంలో

- మిగతా 2లో






# సొంత వ్యూహాలతో జనసేన సిద్ధమేనా ?

రాజకీయాలు అంటే నిరంతరం పారే నది లాంటివి. ఆ నదిలో కూడా పైకి కనిపించే స్వచ్ఛత లోపల ఉండదు, పైగా గండాలు సుడి గుండాలు ఎన్నో ఉంటాయి. అలాంటి పాలిటిక్స్ అంటేనే టఫెస్ట్ జాబ్ అని అంటారు. ఇక్కడ ఎవరూ ఒకరిని కోరి ముద్దాడరు, అలాగే నెత్తికి ఎక్కించుకుని అందలాలు అందించరు, శోధించి సాధించిన వారికే పగ్గాలూ పట్టాభిషేకాలు దక్కుతాయి. జనసేన ఈ విషయంలో గట్టిగానే ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. జనసేన అధినేత ఎప్పుడూ ఏ వేదిక మీద అయినా ఒక్కటే మాట అంటున్నారు, పొత్తులు కూటములు అంటూ ఆయన మాట్లాడుతున్నారు. పొత్తులు అన్నవి రాజకీయాల్లో వ్యూహం మాత్రమే. వ్యూహాలు కూడా పది వేస్తే అన్నీ హిట్ అవాల్సిన అవసరం లేదు, పైగా ఒకసారి హిట్ అయింది మళ్ళీ అవాలని అసలు లేదు అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

**మోడీ మీద ఆరాధన :**

ప్రధాని మోడీ మీద ఆరాధన జనసేన అధినేతకు ఉండొచ్చు తప్పు లేదు, ఆయన తనకంటూ ఒక కుటుంబం లేకుండా దేశం కోసం అంకితం అయి పనిచేస్తున్న వారు అని కూడా పవన్ కి ఉండొచ్చు. అయితే దానిని మరీ బాహాటంగా చెప్పాల్సిన అవసరం లేదని అంటున్నారు. పైగా బీజేపీ ఒక పార్టీ జనసేన ఒక పార్టీ అన్నది గుర్తెరగాలి అంటున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఓపెనింగ్ లో మోడీ మీద పవన్ ఆరాధనాభావం అయితే పీక్స్ కి వెళ్ళిందని అంటున్నారు. మోడీని అంటే కన్నీళ్ళు వచ్చాయని ఆయన చెబుతున్నారు. అయితే దానికి ముందూ వెనకా ఎన్నో జరిగాయని కూడా విశ్లేషించుకోవాలి కదా అంటున్నారు. విద్యార్ధుల ఉద్యమం ఏకంగా పాతిక రోజులకు పైగా నడిచింది. వారి మీద పోలీసులు దాడి చేశారు. దానికి ప్రతిస్పందనగా అలా మోడీని టార్గెట్ చేయడం జరిగింది అని ఆ వైపు నుంచి వస్తోంది. ఇక జెన్ జీ యూత్ అయితే పవన్ వ్యాఖ్యల మీద సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.

**శాశ్వత ప్రధానిగా మోడీ :**

మోడీయే ఎల్లకాలం ప్రధాని అన్నది పవన్ భావన కావచ్చు, ధీమా కావచ్చు, కానీ రాజకీయాల్లో ఎపుడేమి జరుగుతుందో ఎవరికీ తెలియదు అంటారు. అందువల్ల 2029 లో మోడీ బీజేపీ పరిస్థితి ఏంటి అన్నది కూడా చూడాల్సి ఉంటుంది. మోడీ శాశ్వత ప్రధానిగా ఉంటే దేశానికి మేలు అన్నది పవన్ అభిప్రాయం కావచ్చు, కానీ రాజకీయాల్లో ప్రజాస్వామ్యంలో మార్పు సహజం. అందుకే పవన్ మాటలకు కాంగ్రెస్ వంటి పార్టీల నుంచి రియాక్షన్ వస్తోంది అని అంటున్నారు.

**జనసేనకు అండగా :**

జనసేనకు బీజేపీ అండగా ఉంది అన్నది నిజం. ముఖ్యంగా మోడీ పవన్ ని బాగా ఆదరించి అభిమానిస్తున్నారు. కానీ ఎల్ల కాలం ఈ రకమైన పరిస్థితి ఉండకపోవచ్చు అని అంటున్నారు. రేపటి రోజున దేశ రాజకీయ ముఖ చిత్రం మారినపుడు దానికి అనుగుణంగా ఏ పార్టీ అయినా తమ సొంత వ్యూహాలను అజెండాను యాక్షన్ ప్లాన్ ని తయారు చేసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. దాంతో పాటుగా జనసేనను సొంత లక్ష్యాలతో అధికారానికి దగ్గర చేయడానికి ప్రయత్నం చేయాలని కోరుతున్న హితైషులు కూడా ఉన్నారు. మొత్తానికి సందర్భం కాకపోయినా పవన్ తన అభిమానాన్ని మోడీ పట్ల చాటుకున్నారు. ఇపుడు మోడీ ప్రత్యర్ధులకు అవి ఏ మాత్రం నచ్చడం లేదని అంటున్నారు. అందుకే రాజకీయాల్లో ఆచీ తూచీ మాట్లాడాలని కూడా సూచనలు వస్తున్నాయి.

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

- మొదటి పేజి తరువాయి

దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# “మిస్టర్ డ్రామారావు” అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- మొదటి పేజి తరువాయి

పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం ‘ఎక్స్’ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న ‘మిస్టర్ డ్రామారావు’ కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు.

తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే

అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

# కర్ణాటక కేబినెట్ విస్తరణ: చివరి నిమిషంలో మార్పులతో కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది. మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు.

సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు.వీరితో పాటు సీనియర్ నేతలు హంపనగౌడ బదర్లి, అశోక్ పట్టణ్, రాఘవేంద్ర హిట్నాల్ వంటి వారు కూడా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్ సేఠ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆయన అనుచరుడు ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల మధ్యే నేడు సాయంత్రం లోక్ భవన్ ప్రాంగణంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది.

# నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు.. దేశంలోనే కొత్త రికార్డ్!

- మొదటి పేజి తరువాయి

సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు.మొత్తం 1000 శస్త్రచికిత్సలలో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరంద

నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.

# కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసు: మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగారం

కడప ఎయిర్‌పోర్ట్‌లో తొమ్మిదేళ్ల క్రితం నమోదైన లంచం కేసులో కర్నూలులోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎయిర్‌పోర్ట్ మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

వివరాల్లోకి వెళితే, కడప ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్)గా, తాత్కాలిక ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్, ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేశారు. ఆ కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులను త్వరగా ప్రాసెస్ చేసేందుకు, అతని సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా ఉండేందుకు రూ. 50,000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఈ వ్యవహారంపై బాధితుడు సీబీఐని ఆశ్రయించడంతో 2015 జూలై 24న శ్రీనివాసన్‌పై కేసు నమోదైంది. అనంతరం, లంచంలో మొదటి విడతగా రూ. 25,000 నగదు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తన అధికారిక హోదాను దుర్వినియోగం చేసి లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ తన దర్యాప్తులో నిర్ధారించింది. ఈ కేసుకు సంబంధించి లోతైన దర్యాప్తు జరిపిన సీబీఐ, 2016 ఫిబ్రవరి 29న కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం, తాజాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన కర్నూలు సీబీఐ ప్రత్యేక కోర్టు.. శ్రీనివాసన్‌ను దోషిగా నిర్ధారిస్తూ పైవిధంగా శిక్ష ఖరారు చేసింది. ఈ మేరకు సీబీఐ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించింది.

# మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో తీర్పు.. నిర్దోషిగా బ్రిజ్ భూషణ్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను, మరో నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా తేలుస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నేడు తీర్పు వెలువరించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుకు తెరపడినట్లయింది.తీర్పు వెలువడిన వెంటనే బ్రిజ్ భూషణ్ ‘ఎన్డీటీవీ’తో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. “నాపై ఆరోపణలు వచ్చిన రోజే చెప్పాను.. అవి రుజువైతే ఉరి వేసుకుంటానని. ఈ రోజు కోర్టు నన్ను గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చింది. జరిగిందేదో జరిగిపోయింది” అని ఆయన వ్యాఖ్యానించారు.డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఉన్నప్పుడు బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ పలువురు మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణ పూర్తి చేసిన అనంతరం 2023 జూన్ 15న సుమారు 1500 పేజీల ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.

భారత రెజ్లింగ్ సమాఖ్య అధిపతిగా ఉన్న సమయంలో స్వదేశీ, విదేశీ మహిళా రెజ్లర్ల పట్ల బ్రిజ్ భూషణ్ అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు ఆయనను, సహ నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది.

# టీటీడీ ఆసుపత్రుల్లో మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

- మొదటి పేజి తరువాయి

చేసుకుంటున్నారని ఆరోపించారు.మంత్రి నారా లోకేశ్ అమలు చేస్తున్న ‘రెడ్ బుక్’ రాజ్యాంగం వల్లే రాష్ట్రంలో హింస, అవినీతి కరాళ నృత్యం చేస్తున్నాయని భూమన విమర్శించారు. ప్రాణరక్షక మందుల కొనుగోళ్ల వెనుక ఉన్న ఈ దిగజారుడు కుట్రపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ‘గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ’ పనుల్లో వేగం పెంచండి

- మొదటి పేజి తరువాయి

ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు? తదితర వివరాలను అంశాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్యసాధనలో భాగంగా గత రెండేళ్లలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అంశాన్ని పవన్ గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.

# డీల్ కుదుర్చుకోండి.. లేదా లొంగిపోండి

- మొదటి పేజి తరువాయి

తప్ప ఇరాన్‌కు ఏదీ చేరదు. ఆ దేశం వద్ద ఎప్పటికీ అణ్వాయుధం ఉండదు” అని ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాడులు ఆపాలని తమ బలగాలను ఆదేశించానని చెప్పిన సంగతి తెలిసిందే. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరగబోయే అతిపెద్ద దాడికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశానన్న ట్రంప్.. గల్ఫ్‌లోని మిత్రదేశాలైన ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ విజ్ఞప్తి మేరకు తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. ఆయా దేశాల ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత ఇరాన్‌తో దౌత్యానికి మరింత అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఒప్పందం ఖరారు కాకపోతే మళ్లీ దాడులకు దిగుతామని హెచ్చరించారు. కాగా, ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ.. ట్రంప్ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వాషింగ్టన్‌తో చర్చలు జరపడం లేదని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఏకైక చర్చలు జలసంధికి అవతలి వైపున ఉన్న ఒమన్‌తో మాత్రమేనని చెప్పారు. అది కూడా హర్మూజ్ గుండా తాత్కాలిక సురక్షిత నౌకాయాన మార్గాన్ని ఏర్పాటు చేయడం వరకేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# బీజేపీకి భారీ షాక్.. బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

- మొదటి పేజి తరువాయి

ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్ల ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం విశేషం.బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలో కేవలం 34.30 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పాట్నా లాంటి పట్టణ ప్రాంతంలో, బీజేపీకి అత్యంత పట్టున్న స్థానంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

- మొదటి పేజి తరువాయి

బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీమ ప్రాంత స్థితిగతులు, ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాయలసీమ ప్రాంతం తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని, ఇక్కడి ప్రాకృతిక, మానవ వనరులు దోపిడీకి గురయ్యాయని అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎందరో ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. రాయలసీమ అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిపోయిందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు నాయకులు, మేధావులు ఒకే తాటిపైకి వచ్చి సీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపునిచ్చారు.సీమ పురోగతి కోసం ఆయన ‘ప్రజలు, పాడిపంటలు, పరిశ్రమలు, పర్యటకం, పర్యావరణం’ విధానాన్ని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో రాయలసీమను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై సమగ్ర డాక్యుమెంటరీని రూపొందించడమే కాకుండా, దాన్ని ఆచరణలో సాధించి తీరాలని అన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# రైతుకు మేలు..సమాజానికి ఆరోగ్యం



**ప్యాపిలి,(పెన్ పవర్):** స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ స్టాల్ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ భారతి స్టాల్‌ను ప్రత్యక్షంగా సందర్శించి, ప్రకృతి ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భారతి మాట్లాడుతూ "రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం నేటి సమాజానికి ఎంతో అవసరం. ఈ పద్ధతి ద్వారా సాగు చేయడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గి, నికర ఆదాయం పెరుగుతుంది. అంతేకాకుండా నేల సారాన్ని కాపాడుతూ, పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడంలో ప్రకృతి సాగు కీలక పాత్ర పోషిస్తుంది" అని కొనియాడారు. ప్రజలు కూడా ఇటువంటి విషరహిత ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోవిందరాజులు, రవి కుమార్, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో జిల్లా క్షయ అధికారిణి తనిఖీ



**ప్యాపిలి,(పెన్ పవర్):** క్షయ, కుష్ఠ వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల అమలును పటిష్ఠం చేయడమే లక్ష్యంగా జిల్లా క్షయ మరియు కుష్ఠ వ్యాధుల అధికారిణి డాక్టర్ శారదాభాయి సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా క్షయ, కుష్ఠ వ్యాధులకు సంబంధించిన రికార్డులు, నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్షయ వ్యాధి నిర్ధారణలో స్ఫుటం పరీక్షలు అత్యంత కీలకమని పేర్కొన్న ఆమె, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సంచార వైద్య సేవ (104) సిబ్బంది ద్వారా సేకరించిన స్ఫుటం నమూనాలను ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించి సకాలంలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అనుమానిత క్షయ రోగులను గుర్తించి చికిత్స అందించడంలో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని సూచించారు. అనంతరం కేంద్రంలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాహుల్, రాఘవేంద్ర గౌడు, సరోజ, శ్రీనివాసులు, మల్లికార్జున మరియు వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలోని త్రాగునీటి వనరులు పరీక్షలు నిర్వహించాలి : ఎంపీడీవో గోవర్ధన్



**దొరవారి సత్రం, పెన్ పవర్, ఆగస్టు 3 :** త్రాగు నీటి ద్వారా సంభవించే పలు వ్యాధులను కట్టడి చేసేందుకు ముందు జాగ్రత్తగా చర్యలుగా ప్రతి గ్రామంలోని త్రాగునీటి వనరులను తప్పనిసరిగా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఎంపీడీవో గోవర్ధన్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్ డబ్ల్యూ ఎస్,ఏ.ఈ, ఉమామహేశ్వరి పర్యవేక్షణలో సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సహాయకులకు పరీక్షా కిట్ లను పంపిణీ చేశారు. వాటిని ఉపయోగించే విధానం ఏ ఈ ఉమామహేశ్వరి వివరించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రజలు కలుషిత నీరు త్రాగి వ్యాధుల బారిన పడకముందే ప్రతి గ్రామంలోని వాటర్ ట్యాంకులు, చేతి బోర్లు నీటిని పరీక్ష చేసి అవి సురక్షితమా, కాదా అన్నది. తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఇంజనీరింగ్ సహాయకులు వారి, వారి సచివాలయ పరిధిలో ఈ పరీక్షలు విధిగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ఉమామహేశ్వరి, కార్యదర్శి మధు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

# కూటమి పాలన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్



**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 3:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చిట్టమూరు మండలంలోని యాకసిరి గ్రామ పంచాయతీలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై నారా లోకేష్ రాజీనామా చేయాలి : మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగస్టు 3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలోని ఐసీఐసీఐ బ్యాంకు సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసా గుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 6, 7, 8 తేదీలలో సూళ్లూరుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆగస్టు 10న సూళ్లూరుపేట పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు.

# ప్రజలకు ఇబ్బందిగా ఉన్న వీధి కుక్కలను కట్టడి చేస్తున్నాం



**పలమనేరు,పెన్ పవర్,ఆగస్టు 03 :** ప్రజలకు ఇబ్బందిగా ఉన్న వీధి కుక్కలను కట్టడి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ లోకేష్ వర్మ స్పష్టం చేశారు. సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇందులో ప్రజల నుండి పలు సమస్యలపై మొత్తం 15 వినతులు వచ్చాయన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు కుక్కలు మరియు పశువుల నిర్వహణపై ఇచ్చిన ఆదేశానుసారం పలుచర్యలు తీసుకొంటున్నామని, అందులో భాగంగా పట్టణంలో వీధికుక్కల ను పట్టి, వాటికి పునరుత్పత్తి నియంత్రణ టీకాలు(వ్యాక్సిన్) వేసి వదులు తున్నామన్నారు. ముఖ్యంగా పాఠశాలల ప్రాంతాలు మరియు మదనపల్లె రోడ్, దండపల్లి రోడ్, లింగాయత్ వీధి, గాంధీ నగర్ మరియు రంగాపురం తదితర ప్రాంతాలలో 55 వీధి కుక్కలు పట్టి వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కొరకు చిత్తూరు నగరపాలక సంస్థ నందు ఏ.సి.బి కంట్రోల్ సెంటర్కు తరలించమన్నారు. పట్టణంలోని జంతు ప్రేమికులను ఉద్దేశించి వీది కుక్కలకు ఆహారమును బహిరంగ ప్రదేశములలో అందించడము నిషేదమని మరియు వాటికి అందించే ఆహార విషయమై తగు జాగ్రత్తలు పాటించవలసినదిగా కోరినారు. మాంసాహార దుకాణ యజమానులు మరియు జంతు ప్రేమికులు వాటికి అందించే మితిమీరిన ఆహారము, కలుషిత ఆహారము లేదా కలుషిత మాంసాహారము వలన వాటి యొక్క నైతిక స్థితిలో మార్పు వస్తుందని కావున వాటికి అందించే ఆహార విషయమై జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

# యువత - విద్యార్థి సంఘాలు కలిసి నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయండి



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 3 :** కోవూరు మండల కార్యాలయం వైసీపీ నాయకుల పత్రికల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు మరియు వైసీపీ నాయకులు మాట్లాడుతూ. మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ ఎంక్వైరీ కావాలని.. కారకుడైన విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని... ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని... నిరుద్యోగ భృతి 3000 వెంటనే ఇవ్వాలని నియోజకవర్గ స్థాయిలో పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో కోవూరు మండలం లో ఆగస్టు 6,7,8,9 తేదీల్లో జరగబోయే రిలే నిరాహార దీక్షలు మరియు ఆగస్టు 10వ తేదీ ఇందుకూరుపేట మండలం వైసిపి నాయకులు గుణపాటి సురేష్ రెడ్డి నివాసం వద్ద నుండి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు జరుగు ర్యాలీను నియోజకవర్గస్థాయిలో విద్యార్థి మరియు యువత అధిక సంఖ్యలో పాల్గొని సమావేశంలో కోరడం జరిగింది. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు, ఐదు మండలాల కన్వీనర్లు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఉదయగిరి కోట, రంగనాయకుల ఆలయ పరిరక్షణ పనులు ఎప్పుడు

**పార్లమెంట్‌లో ప్రశ్నించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఉదయగిరి కోట, రంగనాయకుల ఆలయ పునరుద్ధరణ పనుల పురోగతిపై వివరాలు కోరిన ఎంపీ**

**రెండు ప్రాజెక్టులకు రూ. 7.25 కోట్ల అంచనా వ్యయం అని వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం**



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 3:** నెల్లూరు జిల్లా ఉదయగిరిలోని చారిత్రక ఉదయగిరి కోట, రంగనాయకుల ఆలయ పరిరక్షణ పనుల పురోగతి, వాటి అమలుకు అవసరమైన నిధులు, పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంట్‌లో లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సోమవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లే మెట్ల పునరుద్ధరణ, అలాగే రంగనాయకుల ఆలయంలోని ప్రాచీన రాతి నేల పునరుద్ధరణ పనులను నేషనల్ కల్చర్ ఫండ్ ( ఎన్ సి ఎఫ్ ) పరిధిలో గుర్తించిన వారసత్వ పరిరక్షణ ప్రాజెక్టుల్లో చేర్చినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులను కార్పొరేట్ సామాజిక బాధ్యత ( సిఎస్ఆర్ ) నిధుల ద్వారా అమలు చేసే అవకాశాన్ని కల్పించేందుకు నేషనల్ కల్చర్ ఫండ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు ప్రాజెక్టులకు ఏ సంస్థా సిఎస్ఆర్ నిధులు అందించేందుకు ముందుకు రాలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ రెండు పనుల అమలుకు సుమారు రూ. 7.25 కోట్ల అంచనా వ్యయం ఉంటుందని, తుది సాంకేతిక నివేదిక, ప్రాజెక్టు అవసరాలను బట్టి వ్యయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని కేంద్ర మంత్రి వివరించారు. అలాగే వారసత్వ కట్టడాల పరిరక్షణ కోసం సిఎస్ఆర్ సంస్థలు, దాతల నుంచి నిధులను సమీకరించేందుకు నేషనల్ కల్చర్ ఫండ్ తన పోర్టల్ ద్వారా ప్రాజెక్టుల వివరాలను అందుబాటులో ఉంచిందని, ఆసక్తి ఉన్న సంస్థలు ముందుకు వచ్చిన వెంటనే ప్రాజెక్టుల అమలుకు అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉదయగిరి చారిత్రక వైభవాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభమయ్యేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లేందుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంట్ వేదికగా ఈ ప్రశ్నను లేవనెత్తారు.

# ఘనంగా గంధమహోత్సవం



**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 3 :** గూడూరు పట్టణంలోని హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా (చిన్న దర్గా)లో గంధమహోత్సవం ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు, పూలు, విద్యుద్దీపాలంకరణలు, నందలూరు ఫకీర్ల జరబు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గూడూరుతో పాటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని హజ్రత్ వారి సమాధికి లేపనం చేసి, అనంతరం జి. సునీల్ పల్లెపాడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, గూడూరు గంధమహోత్సవం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత గురువులు, దర్గా కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్,మత గురువులు మగ్దూమ్ అలీ షా చిష్టి ఉల్ ఖాదరి, ఖదీర్ అలీ షా చిష్టి ఉల్ ఖాదరి, కమిటీ సభ్యులు షానవాజ్, షబ్బీర్, యస్దాని, గోల్డెన్ గౌస్, సైదులు,అస్లం, గురువులు దిల్దార్ అలీ షా చిష్టి ఉల్ ఖాదరి ,బాసిత్ చెన్నై,ఫర్మాన్ అలీ షా దస్తగీర్ చెన్నై,గౌసె మస్తాన్ ఖాదరి,కరీముల్లా చిష్టి, రెహమాన్ అలీ షా, నూర్ అలీ షా, హైదర్ అలీ షా,సలీం చిష్టి,నసీర్ ఖాదరి, రియాజ్,ఇస్మాయిల్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు పాత బస్టాండ్‌లో హైర్ బస్సుల నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం



**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 3:** గూడూరు పాత బస్టాండ్‌లో నెల్లూరు వైపు వెళ్లే వెంకటగిరి డిపో హైర్ బస్సులు అధికారిక బస్టాప్‌లో ఆగకుండా వెళ్లిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని తెలిపారు. బస్సు ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించిన ప్రయాణికులతో కొందరు డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని నడుస్తున్న హైర్ బస్సులు ప్రజా సేవలో నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తోందని విమర్శించారు. గూడూరు పాత బస్టాండ్‌లో ప్రతి హైర్ బస్సు తప్పనిసరిగా నిర్ణయించిన బస్టాప్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న డ్రైవర్లు, సిబ్బందిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, రవాణా శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

# నిరాహార దీక్షకు స్థల పరిశీలిన మాజీ మంత్రి నల్లపరెడ్డి



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 3 :** డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ ఎంక్వైరీ కావాలని.. కారకుడైన విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని... ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని... నిరుద్యోగ భృతి 3000 వెంటనే ఇవ్వాలని కోవూరు నియోజకవర్గ స్థాయిలో పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షల కొరకు కోవూరు మండలంలో నాయకులు తో కలసి స్థలాన్ని పరిశీలించిన.. మాజీ మంత్రివర్యులు వైసీపీ రాష్ట్ర పాక్ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి

# నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి టెండర్లు పిలవాలి

### కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయను కలిసిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
### కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి వినతిపత్రం అందజేసిన ఎంపీ
### సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 3:** నెల్లూరు జిల్లా కేంద్రంలో 100 పడకల ఈఎస్ఐ ( ఈఎస్ఐ ) ఆస్పత్రితో పాటు సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ కోరారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తో కలిసి సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అనువైన స్థలంతో పాటు, సిబ్బంది క్వార్టర్ల కోసం ఒక ఎకరం స్థలాన్ని ఇప్పటికే కేటాయించినట్లు ఎంపీ లేఖలో పేర్కొన్నారు. సంబంధిత అధికారుల బృందం పరిశీలన పూర్తి చేసి ఆ స్థలాలు అనుకూలంగా ఉన్నట్లు ధ్రువీకరించారని తెలిపారు. ఈ ప్రాంతంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు, వారి కుటుంబాలకు ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. స్థల ఎంపిక పూర్తయినందున నిర్మాణానికి సంబంధించి తక్షణమే టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వినతిపై కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ వెంటనే సానుకూలంగా స్పందించారు. 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి టెండర్లు వెంటనే పిలవాలని డైరెక్టర్ జనరల్ ఈఎస్ఐ వారిని ఆదేశించారు. నెల్లూరు ఈఎస్ఐ ఆస్పత్రి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించినందుకు కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఫొటోగ్రఫీ పోటీల్లో భాగస్వాములుకండి : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, అగస్ట్, 03 :** ఈ నెల 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేయనున్నామని, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలులోగా ఎంట్రీలు సమర్పించాలని, గడువు పొడిగింపు ఉండదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలోని ఫొటో జర్నలిస్టులు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, స్టూడియో ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని.. మొదటి విభాగంలో జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వారసత్వం, పర్యాటకం, సంస్కృతి అంశాల్లో ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో యువత, పీ4, ఆర్థికాభివృద్ధి–సంక్షేమం అంశాలు, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ. 10 వేలు,ద్వితీయ బహుమతి కింద రూ. 7 వేలు తృతీయ బహుమతిగా రూ. 4 వేలు నగదు బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక విభాగం నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు విభాగాల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చన్నారు. 2025, జూన్ 12 నుంచి 2026, జులై 31 మధ్య తీసిన ఫొటోలై ఉండాలని.. ఫొటో సైజు 12x10 ఉండాలని, ఫొటోలు ఎన్‌టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలని వివరించారు. వాటర్ మార్క్, మార్ఫింగ్ వంటి వాటిని అనుమతించడం జరగదని.. ఉత్తమ ఫొటోల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని తెలిపారు. ఒరిజినల్ ఫొటో ఎంట్రీలను డీపీఆర్వో కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, విజయవాడ–520002 చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా సమర్పించవచ్చన్నారు. ఇతర వివరాలకు కె.రవి, డివిజనల్ పీఆర్వో (9010156550)ను సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# తాజా కూరగాయలు, పండ్లు నేరుగా ఇంటిగుమ్మం వద్దకే జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 3 :** ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన, తాజా కూరగాయలు, పండ్లను ఆన్‌లైన్ ద్వారా సులభంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజి రైతు బజార్" పేరుతో వినూత్న సేవలను ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి యాప్ రిజిస్ట్రేషన్, పనిచేసే విధివిధానాల గురించి ప్రజెంటేషన్ అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో విజయవంతంగా అమలవుతున్న ఈ సేవలను ఇప్పుడు గుంటూరు, మంగళగిరి నగరాల ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన వెల్లడించారు. డిజి రైతు బజార్ ద్వారా వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ లేదా ఆన్‌లైన్ వేదిక ద్వారా కూరగాయలు, పండ్లను ఆర్డర్ చేయవచ్చని, రైతుల నుంచి నేరుగా సేకరించిన నాణ్యమైన ఉత్పత్తులను తగిన నాణ్యత ప్రమాణాలతో వినియోగదారుల ఇంటి వద్దకే సరఫరా చేస్తామని తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వినియోగదారులకు మధ్యవర్తులు లేకుండా నాణ్యమైన ఉత్పత్తులు అందుతాయని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు డిజిటల్ సాంకేతికతను వినియోగించడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచడం, ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

# తల్లిపాలే శిశువు జీవితానికి అమృతధార జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, అగస్ట్, 03 :** తల్లిపాలే శిశువు ఆరోగ్యకర జీవితానికి అమృతధార అని.. మొదటి ఆరు నెలల వరకు వాటిని మాత్రమే అందించడం ద్వారా శిశువుకు సంపూర్ణ పోషకాహారం, మెరుగైన రోగనిరోధక శక్తి లభిస్తాయని.. ఆరోగ్యకరమైన ఎదుగుదల, మానసిక వికాసానికి తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 – ఆగస్టు 7) సందర్భంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులతో కలిసి గోడ పత్రికను, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో సుస్థిరమైన ఆరంభం కోసం తల్లిపాలు.. ఇతివృత్తంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత మాత్రమే అనుబంధ ఆహారాన్ని ప్రారంభించాలన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రారంభించాలని.. గోల్డెన్ అవర్‌లో వాటిని ఇవ్వడం వల్ల శిశువుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని.. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఎదుగుదల, మానసిక వికాసానికి ఇవి ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని, తల్లిపాల విశిష్టతపై క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఎంహెచ్‌వో డా. ఎ.శ్రావణబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శరత్‌బాబు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.


# తల్లిపాలే శిశువు జీవితానికి అమృతధార జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, అగస్ట్, 03 :** తల్లిపాలే శిశువు ఆరోగ్యకర జీవితానికి అమృతధార అని.. మొదటి ఆరు నెలల వరకు వాటిని మాత్రమే అందించడం ద్వారా శిశువుకు సంపూర్ణ పోషకాహారం, మెరుగైన రోగనిరోధక శక్తి లభిస్తాయని.. ఆరోగ్యకరమైన ఎదుగుదల, మానసిక వికాసానికి తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 – ఆగస్టు 7) సందర్భంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులతో కలిసి గోడ పత్రికను, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో సుస్థిరమైన ఆరంభం కోసం తల్లిపాలు.. ఇతివృత్తంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత మాత్రమే అనుబంధ ఆహారాన్ని ప్రారంభించాలన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రారంభించాలని.. గోల్డెన్ అవర్‌లో వాటిని ఇవ్వడం వల్ల శిశువుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని.. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఎదుగుదల, మానసిక వికాసానికి ఇవి ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని, తల్లిపాల విశిష్టతపై క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఎంహెచ్‌వో డా. ఎ.శ్రావణబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శరత్‌బాబు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.


# కోటప్పకొండలో వైభవంగా త్రికోటేశ్వరస్వామి సహస్ర ఘటాభిషేకం

### భక్తిశ్రద్ధలతో పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 03:** పల్నాడు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సహస్ర ఘటాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఆవరణ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. వేలాది మంది భక్తులు ఈ మహోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరయ్యారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సహస్ర ఘటాభిషేకంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**సహస్రఘటాభిషేకం విశిష్టత:** శైవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన సేవలలో సహస్ర ఘటాభిషేకం ఒకటి. వెండి, రాగి లేదా మట్టి ఘటాలలో పవిత్ర నదీజలాలు, తీర్థాలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ జలాలు నింపి వేద మంత్రాలు, రుద్రపారాయణం, శివపంచాక్షరి మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. సహస్ర అంటే వెయ్యి, ఘటాలు అంటే కలశాలు. వెయ్యి కలశాలలో పవిత్ర జలాలను నింపి పరమశివునికి అభిషేకం చేయడం వల్ల సకల పాపాలు తొలగి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యం, మనశ్శాంతి కలుగుతాయని భక్తుల విశ్వాసం. అభిషేకం అనంతరం మహానైవేద్యం సమర్పించి హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఆధ్యాత్మికత నిండిన వాతావరణంలో కొనసాగింది. కోటప్పకొండలో జరిగిన ఈ సహస్ర ఘటాభిషేక మహోత్సవం భక్తుల విశేష ఆదరణతో విజయవంతంగా ముగిసింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్, దేవాలయం ప్రధాన అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

# పంటల బీమా గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 3 :** రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. ప్రతి అర్హ రైతు పంట బీమా చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యత పరిమితంగా ఉండే అవకాశమున్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ అధికారులు చైతన్యం కల్పించాలని సూచించారు. కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేయడం, మండలాల వారీగా పంట విస్తీర్ణ వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రీన్ గుంటూరు' కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న 22(ఎ) కేసులను ఆగస్టు 15లోగా పరిష్కరించాలని సూచించారు. గృహ పట్టాల రెగ్యులరైజేషన్, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, అన్నా కాంటీన్లు, విద్యుత్ దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. తల్లికి వందనం' పథకం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, బడి బయట ఒక్క పిల్లవాడు కూడా ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆగస్టు 13న సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభోత్సవం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్ డా. లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 3 :** ప్రజా సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ తెలిపారు. విజయవాడ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 189 వినతులు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా 78 వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించినవని వెల్లడించారు. పెండింగ్ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి అర్జీదారుతో నేరుగా మాట్లాడిన అనంతరమే నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ వివాదాలు, సర్వే సమస్యలు, రెవెన్యూ అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. 1100 టోల్‌ఫ్రీ సేవతో పాటు సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఎరువుల దుకాణాలు, సహకార సంఘాలు ఉదయం 6 గంటలకే ప్రారంభం కావాలని, రైతులకు తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎరువుల విక్రయాలపై నిరంతర పర్యవేక్షణతో అక్రమాలను అరికట్టాలని సూచించారు. భూగర్భ జలాల పెరుగుదలకు ఫార్మ్ పాండ్స్ కీలకమని పేర్కొంటూ, మంజూరైన అన్ని పనులను వచ్చే నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆర్డీవోలు, ఎంపీడీవోలను ఆదేశించారు. అలాగే ఆత్కూరు గ్రామ కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు వెంటనే జారీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీనరసింహ, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి. జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆయుష్ ఆసుపత్రికి స్థల పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 3 :** ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం స్థల పరిశీలన చేశారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ పరిధిలో స్థల పరిశీలన జరిగింది. గుంటూరు పట్టణానికి అతి సమీపంలో ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు రావడం వలన ప్రజలకు ఎంతోఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తహసిల్దార్ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# క్రెడిట్ చోరీ అనే వింత జబ్బుతో జగన్ బాధపడుతున్నాడు : ప్రత్తిపాటి

## చిలకలూరిపేట రైతు బజార్లో ప్రభుత్వ సబ్సిడీ బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రత్తిపాటి





**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 03 :** ఎల్ నినో ప్రభావంతో బియ్యం ధరలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, బియ్యం సహా, ఇతర నిత్యావసరాల పెరుగుదల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. సోమవారం ఆయన చిలకలూరిపేట రైతు బజార్ లో ప్రభుత్వం-రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ బియ్యం విక్రయకేంద్రాన్ని ప్రారంభించారు. తెల్లరేషన్ కార్డుదారులకు స్వయంగా బియ్యం పంపిణీ చేసిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**అవినీతి సంపాదన.. అసత్యాల మీడియాను అడ్డుపెట్టుకొని జగనే ప్రభుత్వ విజయాల్ని క్రెడిట్ చోరీ చేస్తున్నాడు :** మాజీ ముఖ్యమంత్రి జగన్.. ఈ మధ్య క్రెడిట్ చోరీ అనే వింతజబ్బుతో బాధపడుతున్నారని, ఇతరుల మంచి, గొప్పతనాన్ని తనవిగా చెప్పుకోవడం ఆ జబ్బు ప్రధాన లక్షణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా ప్రధాని చేతుల మీదుగా ప్రారంభమైన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఖ్యాతి మొత్తం తనదేనని జగన్ నిస్సిగ్గుగా చెప్పుకుంటూ, అసలైన క్రెడిట్ చోరీ జగనే చేస్తున్నాడన్నారు. చేతిలోని అవినీతి సంపాదనతో అనుకూల మీడియా, అసత్యాల సోషల్ మీడియాలో ప్రభుత్వ విజయాలను తనవిగా దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని ప్రత్తిపాటి మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం విషయంలో తానున్నప్పుడే అన్నీ చేశానని, కోర్టుకేసుల్ని తొలగించానని జగన్ చెప్పడం.. పచ్చి అబద్ధమన్నారు. రెండేళ్లుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లు రాష్ట్రం కోసం పడుతున్న కష్టాన్ని, మోదీ అందిస్తున్న సహకారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ వైఫల్యాల్ని బీజేపీ ఎత్తిచూపుతున్నా..... వైసీపీ నేతలు సిగ్గులేకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. జగన్.. వైసీపీనేతలు ఇప్పటికైనా పరుల కష్టాన్ని తమదిగా చెప్పుకోవడం మానుకోవాలని ప్రత్తిపాటి హితవుపలికారు. చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంలో రాకెట్ స్పీడ్ లో దూసుకెళ్తున్న రాష్ట్రాన్ని చూసి మోదీ గర్విస్తుంటే.. జగన్, వైసీపీనేతలు అసూయ చెందడం సిగ్గుపడాల్సిన అంశమని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.

**బియ్యం ధరలపై ఆందోళన చెందాల్సిన పనిలేదు :** ఎల్ నినో దృష్ట్యా వరిసాగు మందగించిన నేపథ్యంలో బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతాయన్న ఆందోళన అవసరం లేదని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని ప్రత్తిపాటి చెప్పారు. మార్కెట్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, బియ్యంతో పాటు, ఇతర నిత్యావసరాల ధరలు పెంపుదలపై ప్రత్యేక నిఘా పెట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, మురకొండ మల్లిబాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముందు జాగ్రత్తతోనే అంటువ్యాధుల నివారణ సాధ్యం : డాక్టర్ దాసరి చంద్రశేఖర్



**పర్చూరు, పెన్‌పవర్, ఆగస్టు 3:** పర్చూరు మండలంలోని నూతలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సాయంత్రం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సీజనల్ అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, ప్రోటోజోవా వంటి సూక్ష్మక్రిములు, అలాగే దోమలు, ఈగల ద్వారా అంటువ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, బాసిల్లరీ డిసెంటరీ, జలుబు, ఇన్ఫ్లుఎంజా, అస్తమా, తామర వంటి సీజనల్ వ్యాధులు ఈ కాలంలో ఎక్కువగా ప్రబలే అవకాశముందని పేర్కొన్నారు. ఈ వ్యాధులను నివారించడం ప్రతి ఒక్కరి చేతుల్లోనే ఉందని ఆయన అన్నారు. భోజనం చేసే ముందు, మలమూత్ర విసర్జన అనంతరం కనీసం 30 సెకన్ల పాటు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు మోచేతిని అడ్డుగా పెట్టుకోవడం, కాచి చల్లార్చిన నీటినే తాగడం, మూతపెట్టిన పరిశుభ్రమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అలాగే పాఠశాల ప్రాంగణం, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతలపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ దేవరకొండ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

## కూటమి ప్రభుత్వ హామీల అమలే లక్ష్యం: వైవిబి. రాజేంద్రప్రసాద్



**పెన్ పవర్, ఉయ్యూరు, ఆగస్టు 03:** స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమానికి నిదర్శనమని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వైవిబి. రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు టౌన్ టీడీపీ అధ్యక్షుడు జంపాన గురునాధరావు ఆధ్వర్యంలో ఉయ్యూరులోని 13వ వార్డులో రాజేంద్రప్రసాద్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేసి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ హక్కు కల్పించిందన్నారు. రాష్ట్రం ఆర్థిక లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, అబ్దుల్ కుదూస్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్, సీనియర్ నాయకుడు రత్నం బుజ్జి, నాయకులు జంపాన వీర శ్రీనివాస్, రాజులపాటి ఫణి, 13వ వార్డు అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, దుర్గాప్రసాద్, మాజీ కౌన్సిలర్లు పరిమి సలోమి సంతోషి, తెనాలి పద్మావతి, కోరాడ వెంకటలక్ష్మి, నడిమింటి పైడయ్య, మాదినేని జ్యోతి, చలపాటి మణికంఠ, బొర్రా సుబ్బారావు, లక్ష్మణ, కటారి తిరుపతిరావు, రామనోళ్ళ, చింతయ్య, జంపాన అర్జున్‌రావు, ఆరేపల్లి సుబ్బారావు, కొలసాని సీతారామయ్య, పుల్లేశ్వరరావు, రాజులపాటి వెంకట్, ఆశాదేవి, మోదుగు మోడీ కుటుంబరావు, కొలగాని సాంబశివరావు, చిట్టీ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పుటూరులో నూతన హోమియో వైద్యశాల భవన నిర్మాణ పనులకు శ్రీకారం




**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 3 :** పర్చూరు మండలంలోని ఉప్పుటూరులో ప్రభుత్వ హోమియో వైద్యశాల నూతన భవన నిర్మాణ పనులు సోమవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. జూలై 25న భూమిపూజ నిర్వహించిన అనంతరం నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు, జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థ సిబ్బందితో మాట్లాడిన ఆయన, నాణ్యమైన నిర్మాణ సామగ్రిని వినియోగించి ఎలాంటి లోపాలకు తావులేకుండా భవనాన్ని నిర్మించాలని సూచించారు. భవిష్యత్తులో రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పనులు అత్యుత్తమ ప్రమాణాలతో చేపట్టాలని, అలాగే నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన హోమియో వైద్యశాల భవనం అందుబాటులోకి వస్తే పర్చూరు మండల ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వ హోమియో వైద్య సేవల విస్తరణలో ఈ భవనం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది అంకమ్మరావు, వెంకటేష్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాలేరు శ్రీనివాసరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వాహనాన్ని ఢీకొట్టి వ్యక్తికి తీవ్రగాయాలు





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఆగస్టు 03:** స్థానిక గుంటూరు–మార్టూరు రహదారిపై జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. హైవే మెయిం టెనెన్స్ టీమ్ తెలిపిన వివరాల ప్రకారం... మిడిదొడ్డి రాంబాబు అనే వ్యక్తి తీవ్ర మద్యం మత్తులో, తన ముందు వెళ్తున్న బీటెక్ విద్యార్థుల వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో రాంబాబు తలకు బలమైన గాయమైంది. ప్రమాదానికి గురైన బీటెక్ విద్యార్థులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన హైవే మెయింటెనెన్స్ టీమ్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. తీవ్రంగా గాయపడిన రాంబాబును, అదేవిధంగా స్వల్ప గాయాలైన విద్యార్థులకు అంబులెన్స్ ద్వారా హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, పరిస్థితి తీవ్రత దృష్ట్యా మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యుల సూచన మేరకు రాంబాబును గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి (జీజీహెచ్) రిఫర్ చేశారు.

# ఫ్లక్స్‌టెక్ సొల్యూషన్స్‌లో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం

## మహిళల భద్రతకు శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని సూచన



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 3 :** బాపట్ల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చీరాల పట్టణంలోని కేకే కాంప్లెక్స్ 5వ అంతస్తులో ఉన్న ఫ్లక్స్‌టెక్ సొల్యూషన్స్ ఇన్క్ సంస్థలో ఉద్యోగులకు శక్తి యాప్ వినియోగంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ సూచనలతో, చీరాల వన్‌టౌన్ సీఐ జి. సోమశేఖర్ ఆధ్వర్యంలో చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. సంస్థ మేనేజర్ వి. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శక్తి టీం కానిస్టేబుల్ కె. సుబ్బారావు పాల్గొని ఉద్యోగులకు భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలపై జరిగే ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదన్నారు. ఇలాంటి సంఘటనలు ఎదురైన వెంటనే శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని లేదా 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఆయన, వేధింపుల రహిత వాతావరణం ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. అలాగే మహిళలు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలనతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకుని తమ హక్కులను తెలుసుకోవడం ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని శక్తి యాప్ వినియోగంపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ఇంటింటికి టీడీపీ ప్రచారంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 3 :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి టీడీపీ" ప్రచార కార్యక్రమంలో భాగంగా చీరాల పట్టణంలోని మార్కెట్ సెంటర్ ప్రాంతంలో సోమవారం చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి స్థానికులను కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్ర అభివృద్ధికి మరింత కృషి చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కూటమి ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అన్నదాతలను బతికిస్తేనే మనుగడ

## మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

### సాగునీటి సమస్యపై చల్లపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశం

రైతులను బతికించకపోతే ఏ వ్యాపారాలు బతకవని, పండించకపోతే మనిషి మనుగడే కష్టమవుతుందని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయ కర్త, రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కృష్ణా డెల్టా వరి రైతుల సాగునీటి సమస్యపై అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రైతు నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఖర్చుపెట్టే డబ్బు ఒకేచోట కేంద్రీకరించకుండా రైతాంగానికి ఉపయోగపడేటట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న భూములకు సాగునీరు అందించాలంటే చెక్‌డ్యాములు కట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వివరించారు. చెక్ డ్యాముల నిర్మాణానికి పునాది నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే పడిందన్నారు. దాన్ని ముందుకు తీసుకువచ్చి చెక్‌డ్యాములు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉన్న నీటిని విద్యుత్‌కు వాడి సాగునీటికి చేతులెత్తేయడం న్యాయమా..?

విద్యుత్ ఉత్పత్తి కోసం రిజర్వాయర్లలో ఉన్న నీటిని ఖాళీ చేసి తీరా సాగునీరు అందించే సమయంలో రిజర్వాయర్లలో నీరు లేదని సాకు చెప్పడం న్యాయమా అని రైతుల నాయకులు మాలెంపాటి కాంచనరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీరు అందించకపోగా ఆరుతడి పంటలు వేసుకోవాలని సలహా ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలో భూములు ఆరుతడి పంటలకు పనికిరావని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులు మీర్ రిజ్వాన్, మలినీడి యల్లమందారావు, అడ్డాడ ప్రసాద్‌బాబు, హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, యద్దనపూడి మధు, మహ్మద్ కరీముల్లా, జన్ను జగన్, కాంచనరావు, గుత్తికొండ రాము తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసంలో 52 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసంలో 52 అర్జీలు అందాయి. వీటిని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు స్వయంగా అందుకున్నారు. కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరి కొన్ని అర్జీలను ఫోన్‌లలో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. స్థానికంగా న్యాయం జరగని పక్షంలో నేరుగా తనను కలిసి సమస్యను తెలియ జేస్తే సత్వర పరిష్కారానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రతి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించేలా చూస్తానని, బాధితులు అధైర్యపడాల్సిన అవసరం లేదని చెప్పారు.

# పంట బీమా తప్పనిసరిగా చేయించుకోండి

నీటి లభ్యత అనిశ్చితి పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయాలని ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ నుంచి వీడియో ద్వారా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కాలువల నుంచి నీటి సరఫరా కూడా పరిమితంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దిగుబడి తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది పంట బీమా అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు. దీంతో ఆర్థిక రక్షణ పొందవచ్చన్నారు. పంట రుణాలు తీసుకునే రైతులు సంబంధిత బ్యాంకుల ద్వారా ఇతర రైతులు గ్రామ, వార్డు సచివాలయాలు, సహకార సంఘాల ద్వారా పంట బీమా నమోదు చేసుకోవచ్చునన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.

## సాగులో అప్రమత్తతే లాభం.. శాస్త్రవేత్తల సూచనలు




**గూడూరు పెన్ పవర్ ఆగస్టు 3 :** గూడూరు మండలంలోని కప్పలదొడ్డి, ఆకులమన్నాడు, ఆర్.వి.పల్లె, కంకటావ గ్రామాల్లో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎల్నినో ప్రభావ పరిస్థితులపై సోమవారం శాస్త్రవేత్తల బృందం క్షేత్ర సందర్శన నిర్వహించింది. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, ఏ.పి.జి.సి. లామ్--గుంటూరు, జంగమహేశ్వరపురం కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున వరికి బదులుగా జీలుగా విత్తన ఉత్పత్తి చేపట్టడంతో పాటు పి.ఎం.డి.ఎస్. (ౖతీవ-వీశీఅంశీశీఅ ఐతీవ వాశీషఱఅస్త్ర) విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతులు తక్కువ ఖర్చుతో పంట నిర్వహణ చేపట్టి నష్టాలను తగ్గించుకోవాలని వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగులో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో డా. కె. నాగేంద్ర, సస్యపోషణ శాస్త్రవేత్త డా. వెంకటలక్ష్మి, డా. జే. రాధాకృష్ణ, డా. రత్నబాబు, జేడీఏ జ్యోతి రమణి, మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు (వాూాం) మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రైతులకు భరోసా - వినియోగదారులకు ఊరట : ఎమ్మెల్యే బోడే ప్రసాద్

**ధాన్యం ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం కీలక చర్యలు**



**పెన్ పవర్ కృష్ణాజిల్లా, కంకిపాడు, ఆగస్టు 03 :** రాష్ట్రంలో బియ్యం ధరల పెరుగుదలతో ప్రజలపై భారం పడకుండా కూటమి ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో నాణ్యమైన సన్నబియ్యాన్ని మార్కెట్ ధర కంటే కిలోకు సుమారు రూ.10 నుంచి రూ.12 వరకు తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కంకిపాడు మండలంలోని కంకిపాడు రైతు బజార్‌లో పౌరసరఫరాల శాఖ, కృష్ణా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నబియ్యం విక్రయ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతుల విషయంలో కూడా ప్రభుత్వం ఎలాంటి రాజీ పడడం లేదని, మామిడి, మిర్చి, ధాన్యం వంటి పంటల ధరలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ అవసరమైన చోట ప్రభుత్వ యంత్రాంగం ద్వారా జోక్యం చేసుకుని గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలు తీసుకుంటోందన్నారు. ఒకవైపు రైతులకు గిట్టుబాటు ధర, మరోవైపు వినియోగదారులకు అందుబాటు ధర కల్పించేలా సమన్వయంతో పనిచేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని, రైతు సంక్షేమం, ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాకాని జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

**కాకాని గ్రంథాలయానికి కుర్చీల విరాళం - వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వానికి విజ్ఞప్తి**





**పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 03 :** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి, 'జై ఆంధ్ర' ఉద్యమ నాయకుడు కాకాని వెంకటరత్నం జయంతి, కాకాని తరుణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని కాకాని వెంకటరత్నం విగ్రహం వద్ద ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో పాటు కాకాని వారసత్వ పరిరక్షణకు సంబంధించిన పలు డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించారు. ఈ కార్యక్రమానికి 20 సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్ ముఖ్య అతిథిగా, ఆంధ్ర క్రికెట్ అకాడమీ డైరెక్టర్ కళ్యాణ్ కృష్ణ దొడ్డపనేని గౌరవ అతిథిగా హాజరయ్యారు. వారు కాకాని వెంకటరత్నం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారి లక్ష్మమ్మకు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన పండ్లరసం విక్రయ బండిని అందజేయడంతో పాటు, 100 మందికి పైగా పేదలు, ఆటో డ్రైవర్లకు పండ్ల పంపిణీ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన 'కాకాని ఆశయ సాధన సమితి' అధ్యక్షుడు, ఏపీ హైకోర్టు న్యాయవాది డాక్టర్ కాకాని తరుణ్ కుమార్ మాట్లాడుతూ, కాకాని వెంకటరత్నం ఆశయాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజానాయకుడిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. డాక్టర్ కాకాని తరుణ్ కుమార్, ఎన్.జి. రంగా ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్, కృష్ణా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు జస్తి సతీష్, గుమ్మడి రామకృష్ణ తదితరులు కలిసి లంకా దినకర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాది ఆగస్టు 3న కాకాని వెంకటరత్నం జయంతిని అధికారిక రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించడం, బెంజ్ సర్కిల్ పేరును "కాకాని సర్కిల్"గా మార్చడం, అమరావతిలో కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్య అతిథి లంకా దినకర్ మాట్లాడుతూ, 'ఆంధ్రప్రదేశ్ ఐరన్ మ్యాన్', 'ఏపీ కురియన్'గా పేరుగాంచిన కాకాని వెంకటరత్నం సేవలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన వారసత్వాన్ని భావితరాలకు చేరవేస్తున్న డాక్టర్ కాకాని తరుణ్ కుమార్ సేవలను అభినందించారు.

**కాకాని గ్రంథాలయానికి కుర్చీల విరాళం :** జయంతి కార్యక్రమాల్లో భాగంగా కాకాని గ్రంథాలయానికి కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మాజీ జెడ్పీటీసీ చైర్మన్ పాతూరి నాగభూషణం, ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్, గ్రంథాలయ కార్యదర్శి రామాదేవి పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, కాకాని అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాకాని వెంకటరత్నంకు ఘనంగా నివాళులర్పించారు. సమాజానికి డాక్టర్ కాకాని తరుణ్ కుమార్ అందిస్తున్న సేవలను పలువురు అభినందించారు.

## ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి మహిళా మండల చరిత్రపై పరిశోధనకు పీహెచ్‌డీ పిడపర్తి మాధవీలత.



**గుంటూరు, పెన్ పవర్:అగస్ట్, 03 :** ద్రాక్షారామ సాహిత్యాన్ని, చరిత్రను పరిశోధనల ద్వారా వెలుగులోకి తీసుకొస్తున్న పరిశోధకురాలు హీలింగ్ మాధవీలత ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ది రోల్ ఆఫ్ ఉమెన్స్ ఇన్ ఫ్రీడమ్ మూవ్మెంట్ ఇన్ సౌత్ సౌతేర్న్ కోస్టల్ ఆంధ్ర ప్రదేశ్ (1885--1947)" అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ పరిశోధనను డా. చుక్కా విజయకుమార్ పర్యవేక్షణలో గుంటూరులోని ఏ.సీ. కళాశాలలో పూర్తి చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో మహిళల పాత్ర అనే విషయాన్ని గురించి వివరించారు. మహిళల పాత్ర, వారి త్యాగాలు, సేవలను చారిత్రక ఆధారాలతో విశ్లేషిస్తూ చేసిన ఈ పరిశోధన చరిత్ర అధ్యయనానికి ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభినందించారు. హీలింగ్ మాధవీలతకు పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, సాహితీవేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## మానుకొండవారిపాలెం పొలాల్లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఏడుగురు అరెస్ట్**



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 03 :** పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మానుకొండవారిపాలెం గ్రామ శివారులోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి, కోత ముక్క (పేకాట) ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.24,200 నగదు, నాలుగు మోటార్‌సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, చిలకలూరిపేట మండల పరిధిలో కోడిపందాలు, పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ఆయన కోరారు.

## పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశాలకు రేపు స్పాట్ అడ్మిషన్లు

విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఈ నెల 5వ తేదీ బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండవ విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేయగా మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్లలో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన, పాలిసెట్--2026 పరీక్ష రాసిన, రాయని వారు కూడా పాల్గొనవచ్చని తెలియజేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో నేరుగా విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేరుగా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ

**పల్నాడు జిల్లాలో నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్'పై సమగ్ర నివేదిక అందజేత**




**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 03:** నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని వారి అధికారిక నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లా, నరసరావుపేట కేంద్రంగా జూలై 17న నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్' ద్వారా సాధించిన ప్రగతిని వివరిస్తూ రూపొందించిన పల్నాడు: ఎ క్రానికల్ ఆఫ్ ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే సమగ్ర నివేదికను ప్రధానికి అందజేశారు. ఈ భేటీలో.. జిల్లాలో 'క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్' ద్వారా సాధించిన ప్రగతి, ఆర్థికాభివృద్ధి వివరాలను ఎంపీ గారు ప్రధానికి వివరించారు. మొత్తం 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. వీరిలో దాపు 70,000 మందికి పైగా లబ్ధిదారులకు మొదటిసారి రుణాలు అందించినట్లు వివరించారు. అలాగే, వ్యవసాయ రంగంలో 83,365 మంది రైతులకు రూ. 2,286 కోట్ల వ్యవసాయ రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. వేలాది మంది మహిళలు, ఎంఎస్ఎంఈ (మీవీజు)లు, యువత, చేతివృత్తుల వారు మరియు స్వయం సహాయక సంఘాలకు(వాం+) ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, మౌలిక సదుపాయాలు మరియు ఉద్యోగ కల్పన రంగాలలో పల్నాడు జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నిలుపుతామని ఎంపీ ప్రధాని మోదీ కి తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఆర్థిక వృద్ధిని పెంచేందుకు, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు పల్నాడు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. గ్రామీణ సాధికారత, 'వికసిత్ భారత్' దిశగా అడుగులు వేయడానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా మోదీ హామీ ఇచ్చారు.

# శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి ప్రపంచ స్థాయి ఐఎస్ఓ గుర్తింపు

**నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కృషి ఫలితం**



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 03 :** కోటప్పకొండ ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్, సోమవారం మాట్లాడుతూ పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలో ఉన్న కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతూ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఎూూ) గుర్తింపు పొందింది. నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు నిరంతర కృషి, పర్యవేక్షణతో ఈ ఘనత సాధ్యమైంది. ఇది ఆలయానికి మొట్టమొదటి ఐఎస్ఓ సర్టిఫికేషన్‌గా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కోటప్పకొండకు లభించిన ఈ గుర్తింపు భక్తులందరికీ, స్థానికులకు గర్వకారణంగా మారింది. ఐఎస్ఓ ప్రమాణాల ప్రకారం ఆలయం అన్ని విభాగాల్లో నాణ్యత, పరిశుభ్రత, సేవలను కొనసాగిస్తోంది. నిత్యం సానిటేషన్, శుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించడం, లడ్డు, అరిసెలు తయారీ, నిత్య అన్నదానం వంటి సేవల్లో అంతర్జాతీయ స్థాయి నాణ్యతను నిర్ధారించడం జరుగుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉంచడం వంటి అంశాల్లో ఆలయం ఉన్నత ప్రమాణాలను సాధించింది. ఈ చర్యల ఫలితంగా కోటప్పకొండ దేవస్థానం అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా నిలవడానికి కృషి జరుగుతోంది. ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు కేవలం పాలకుడిగా కాకుండా భక్తుడిగా, సేవకుడిగా ఆలయ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్నారు. ఆరు నెలల క్రితం ఒక భక్తుడు పీజీఆర్ఎస్‌లో వాష్‌రూమ్‌ల శుభ్రత ప్రమాణాలు పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా సాయంత్రం 8 గంటలకు ఎమ్మెల్యే స్వయంగా కొండ కిందికి వెళ్లి, శానిటేషన్ సిబ్బందిని పిలిపించి నంది మండపం దగ్గర కూర్చుని అన్ని సులభ కాంప్లెక్స్‌లు పూర్తిగా శుభ్రం చేసే వరకు పర్యవేక్షించారు. ఆ తర్వాత ఆ భక్తుడికి వివరాలు తెలియజేశారు. ఆయన దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్ని ఎమ్మెల్యేగా కాకుండా భక్తుడిలా నిర్వహిస్తున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. మన ఊరు, మన దేవాలయం -- దాని సంరక్షణ మనందరి బాధ్యత అనే స్ఫూర్తితో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వంలో కోటప్పకొండ ఆలయం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఐఎస్ఓ గుర్తింపు ద్వారా ఆలయం అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రఖ్యాతి పొందనుంది. భక్తులు, స్థానికులు ఎమ్మెల్యే కి అభినందనలు తెలియజేస్తున్నారు.

# కూటమి నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు జనసేన నేతలు

**కొర్రపాటి నాగేశ్వరావు, ఆళ్ళ హరి,చింతా రేణుకరాజు**



**గుంటూరు, పెన్ పవర్,అగస్ట్, 03 :** తన మతిమాలిన వ్యాఖ్యలతో , వికృత చేష్టలతో వైసీపీ నేత అంబటి రాంబాబు రాష్ట్ర రాజకీయాల్లోనే అతిపెద్ద బఫున్ గా మారాడని పత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయ కర్త కొర్రపాటి నాగేశ్వరావు విమర్శించ్చారు. కూటమి నేతలపై అసందర్భంగా , అకారణంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన వైసీపీ నేతల్ని హెచ్చరించారు. సోమవారం శ్రీనివాస రావు తోటలోని పార్టీ కార్యాలయంలో కొర్రపాటి నాగేశ్వరావు విలేకరులతో మాట్లాడారు. అవినీతికి , అక్రమాలకు , హత్యా రాజకీయాలకు , కులమత విద్వేషాలకు బ్రాండ్ అంబాసిడర్ గా మారిన వైసీపీ నేతలకు కూటమి నాయకుల్ని విమర్శించే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి , సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గుంటూరు జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అనందాన్ని వ్యక్తం చేశారు. ప్రజలు వైసీపీని మరచిపోయారని ఉనికి కోసమే పెమ్మసాని చంద్రశేఖర్ పై ఏ ఐ వీడియోలు పెట్టి అంబటి శునకానందం పొందుతున్నాడని దుయ్యపట్టాడు. కూటమి పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని వైసీపీకి ఇక అధికారం కల్లే నని కొర్రపాటి వ్యాఖ్యానించ్చారు.. తన ఇంటిపై జరిగిన దాడి సంఘటనను అంబటి రాజకీయ లబ్ది కోసం వాడుకోవాలని చూస్తున్నారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి విమర్శించ్చారు. ఉపాసకులు చాగంటి కోటేశ్వరరావు , గరికిపాటి నరసింహారావులు చెప్పినట్లు అంబటి రాంబాబు ప్రవచనాలు చెబితే దాడులు చేయలేదని , ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకొని అసభ్యంగా మాట్లాడినందుకే వీపు విమానం మోత మోగించారని ఎద్దేవా చేశారు. అంబటి ఇంటిపై దాడికి పెమ్మసాని చంద్రశేఖర్ కు ఎలాంటి సంభందం లేకపోయినా పదే పదే ఆయన్ని విమర్శించటం అంబటి కు సంస్కారానికి నిదర్శనమన్నారు. పెమ్మసాని పై ఏ ఐ వీడియోలు , ఫోటోలు , పాటలు క్రియేట్ చేసి ఇన్స్టాగ్రామ్ లో, సోషల్ మీడియాలో విడుదల చేసి అంబటి పైశాచికంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటిపై ఏ ఐ ని అడిగితే ఏ సర్టిఫికెట్ చిత్రాలు , వీడియోలు పంపిస్తుందన్నారు. తాము అన్నం తింటున్నామని , తమకు సభ్యతా సంస్కారాలు ఉన్నాయని అందుకే వాటి జోలికి పోవటం లేదన్నారు పెమ్మసాని సంపాదన గురించి అంబటి తరచూ వ్యాఖ్యానించటం పట్ల అయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెమ్మసాని తాను కష్టపడి సంపాదించుకున్న జ్ఞానాన్ని, మేధస్సును పంచి సంపాదించుకున్నారని , వైసీపీ నేతల్లా నిలువెల్లా అవినీతి మయం అయింది కాదన్నారు మరో మూడేళ్ళలో గుంటూరు పార్లమెంట్ ను కూటమి నేతలు అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండేలా కృషి చేస్తున్నారని ఆళ్ళ హరి అన్నారు. లేబర్ సంక్షేమ బోర్డు డైరెక్టర్ చింతా రేణుకరాజు మాట్లాడుతూ కాపు కులానికే అంబటి రాంబాబు మాయని మచ్చలా తయారు అయ్యాడన్నారు.జగన్ రెడ్డి దగ్గర కుక్కలా ఉంటానని బహిరంగంగా చెప్పిన అంబటికి కాపు కులంలో చోటు లేదన్నారు. కాపుల ఔన్నత్యాన్ని , ఆత్మభిమానాన్ని దెబ్బ తీసేలా వ్యాఖ్యలు చేసిన అంబటిని కాపు కులం ఎప్పుడో వెలేసిందని చింత రాజు అన్నారు.

# పోతిన మహేష్ దారెటు...

**విజయవాడ, ఆగస్టు 3, పెన్ పవర్:**
పోతిన మహేష్ ప్రస్తుతం వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న యువ నాయకుడు. విజయవాడ రాజకీయాల్లో ఎదగాలని ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆయనకు మంచి పట్టు ఉంది. జనసేన పార్టీ ద్వారా రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. పవన్ కల్యాణ్ వీరాభిమానిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన రాజకీయ భవితవ్యం సంకటంలో పడింది. గత ఎన్నికలలో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశించారు. కూటమి పొత్తులో భాగంగా ఈ స్థానం బీజేపీకి కేటాయించారు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. జనసేన పార్టీ వీడి వైసీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ ఆయనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. భవిష్యత్తు రాజకీయాలపై ఆయన మదనపడుతున్నారు. విజయవాడ పశ్చిమ సీటుపై పోతిన మహేష్ భారీ ఆశలు పెట్టుకున్నారు. గడచిన ఎన్నికలలో టికెట్ రాలేదు. ఇప్పుడు కూడా అదే సీటు కోరుకుంటున్నారు. అయితే వైసీపీలోనూ బలమైన నాయకులు ఉన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మళ్లీ అదే స్థానం ఆశిస్తున్నారు. దీంతో పోతిన మహేష్ పరిస్థితి క్లిష్టంగా మారింది. పార్టీ అధిష్టానం ఆయనకు గుంటూరు పార్లమెంట్ బాధ్యతలు అప్పగించింది. ఆ బాధ్యతల పట్ల ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తనకు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ పదవి కావాలని కోరుతున్నారు. పార్టీ పెద్దలు ఆయన డిమాండ్ పట్టించుకోవడం లేదు. సొంత పార్టీలో తగిన గుర్తింపు లభించక సతమతమవుతున్నారు. వైసీపీలో తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో జనసేన నుంచి సంకేతాలు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోతిన కోసం జనసేన తలుపులు తెరిచే ఉన్నాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆయనను తిరిగి పార్టీలోకి ఆహ్వానించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే గతంలో పవన్ కల్యాణ్ కుటుంబంపై పోతిన తీవ్ర విమర్శలు చేశారు. ఈ పరిణామం జనసేనలోని కొందరికి నచ్చడం లేదు. ఆయనను మళ్లీ పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. పార్టీలో ఆయనకు స్థానం దక్కడం కష్టమని కొందరు నేతలు భావిస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాలు ఆయనను తీవ్ర గందరగోళంలో నెట్టేశాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గమనిస్తే పోతిన మహేష్ అడకత్తెరలో చెక్కపడ్డ చందంగా మారారు. వైసీపీలో ఉంటే పశ్చిమ సీటు దక్కేలా లేదు. జనసేనకు వెళితే గత విమర్శల కారణంగా వ్యతిరేకత ఎదురవుతోంది. రెండు పార్టీల మధ్య నలిగిపోతున్న ఆయన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విజయవాడ రాజకీయాల్లో తన స్థానం సుస్థిరం చేసుకోవాలని ఆయన తపన పడుతున్నారు. కానీ పరిస్థితులు ఆయనకు అనుకూలంగా మారడం లేదు. అనుచరులు మాత్రం ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుంది. రాజకీయ ప్రయోజనాలు నెరవేరక పోవడంతో పోతిన మహేష్ తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రత్యర్థుల వ్యూహాల కారణంగా ఆయన నియోజకవర్గంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రజల్లోకి వెళ్దామంటే స్పష్టమైన హామీలు కరువయ్యాయి. భవిష్యత్తు కార్యాచరణపై సన్నిహితులతో చర్చిస్తున్నారు. ఏ పార్టీలో కొనసాగాలనేదానిపై త్వరలోనే స్పష్టత ఇస్తారని ప్రచారం జరుగుతోంది. విజయవాడ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ఆయన ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి. మొత్తంగా ఆయన రాజకీయం అత్యంత కీలకమైన మలుపు తిరిగింది.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


# కష్ట కాలంలో మిత్ర పక్షం: మోడీకి ఇది అవసరం.. !

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా నెలకొన్న కొన్ని రాజకీయ పరిణామాలు.. ముఖ్యంగా విద్యార్థి నిరసనలు వంటివి ప్రధాని మోడీకి ఇబ్బందికరంగా మారుతున్నాయి. నీట్ పరీక్ష పేపర్ లీక్ సహా.. అయోధ్య రామయ్య మం దిర విరాళాల చోరీ ఘటన వంటివి రాజకీయాలకు అతీతంగా ప్రజల్లో నిరసనలకు దారి తీశాయి. ఇవి ఒక్క వర్గానికి.. లేదా ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని వర్గాల వారూ.. రాముడికి విరాళాలు ఇచ్చారు. దీంతో ఈ రెండు విషయాలలో జరిగిన తప్పులు.. సహజంగానే కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బందిగా మారాయి. ఎన్నడూలేని విధంగా ఒక నిరసన కారణంగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. అయోధ్య రామమందిర ట్రస్టును మార్చుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ.. జాతీయస్థాయిలో మోడీ సర్కారుకు తీవ్రసంకటంగా పరిణమించాయి. మరోవైపు ప్రధాని, హోం శాఖ మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లుతున్నాయి. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో మోడీని సమర్థించే వారు అవసరం. మోడీని మెచ్చుకునేవారు.. ఆయనకు అండగా ఉండే వారు.. అత్యంత అవసరం. ఖచ్చితంగా ఇదేసమయంలో ఏపీ నుంచి మోడీకి బలమైన మద్దతు లభించింది. భోగాపురం వేదికగా టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు.. ఆయనకు అండగా నిలిచారు. ప్రధానికి మద్దతుగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన ఈ దేశానికి అందివచ్చిన వరమని ప్రశంసలు గుప్పించారు. పైకి చూస్తే.. ఇవి పొగడ్తలుగా అనిపించినా.. కేంద్రం దృష్టిలోను, ముఖ్యంగా ప్రధాని దృష్టిలోను.. ఈ కీలక క్లిష్ట సమయంలో ఆయనకు చంద్రబాబు, పవన్ అందించిన బూస్ట్ అంతా ఇంతా కాదు. దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతున్నట్టు అంచనా వేసుకుంటున్న సమయంలో అనూహ్యంగా వీరిద్దరూ మద్దతు ప్రకటించడం.. కేంద్ర ప్రభుత్వానికి దన్నుగా మారింది. పైగా.. దక్షిణాదిలో బలమైన రెండు ప్రాంతీయ పార్టీల నుంచి మద్దతు కూడగట్టడం ద్వారా.. ఈ సమయంలో ప్రధానికి బిగ్ రిలీఫ్ వచ్చినట్టు అయిందని అంటున్నారు పరిశీలకులు.

## కంచుకోటలో సవాళ్లు....

**అనంతపురం, ఆగస్టు 3, పెన్ పవర్:**
ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కి కంచు కోటగా గుర్తింపు పొందింది. రాజకీయ పరిస్థితులు ఎలా మారినా ఈ ప్రాంతంలో పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, హిందూపురం , ఉరవకొండ వంటి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు సాధించింది. 2024 ఎన్నికల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పార్టీ మరింత బలపడింది. అయితే ఇప్పుడు జిల్లాలో పార్టీ నాయకత్వం ఆశించినంత చురుకుగా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇటీవల రాజకీయ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదని కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. మంత్రి పదవులు లేదా ఇతర కీలక బాధ్యతలు ఆశించిన కొందరికి అవి దక్కకపోవడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం తమ తమ వర్గాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఒకే దిశగా సాగడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం బలహీనంగా ఉండటం వల్ల కేడర్‌లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన ఇంటింటికీ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో అమలు చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ , కాల్వ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొంత చురుకుగా సాగుతున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని పార్టీ వర్గాలే అంటున్నాయి. చాలా చోట్ల ఇంటింటికీ కార్యక్రమం కంటే సమావేశాలు, సమన్వయ చర్చలు, కార్యకర్తల నియామకాలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో పార్టీ కార్యక్రమాల ప్రభావం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది సీనియర్ నాయకులు ఉండటం కూడా సమన్వయానికి సవాలుగా మారిందని అంటున్నారు. ప్రతి నాయకుడు తన రాజకీయ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉండటంతో కొన్ని చోట్ల అంతర్గత పోటీ పెరిగినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య అభిప్రాయ భేదాలు కూడా అప్పుడప్పుడు బయటపడుతున్నాయని సమాచారం. ముఖ్యంగా తాడిపత్రి, హిందూపురం , పెనుకొండ వంటి కీలక నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్ఠానం సమయానికి చక్కదిద్ది, నాయకత్వం మరియు కేడర్‌ను ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడం టీడీపీకి అత్యంత కీలకమైన అంశంగా మారింది.

## పరారీలో వైసీపీ నేతలు

**ఏలూరు, గుంటూరు, ఆగస్టు 3, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలలో కనిపిస్తున్న భయం, ఆందోళన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి కేసులు మూటగట్టుకున్న నాయకులు.. ఇప్పుడు విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక చాంతాడంత పొడవునా పరారీలో ఉంటున్నారు. ఎక్కువ మంది కొత్త కేసుల్లోనే ఇరుక్కుంటున్నారు. కనిపించకుండా పోతున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు మద్యం రవాణా టెండర్ల అక్రమాల కేసులో సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ రాక తీవ్ర షాక్ తగలడం, చింతాడ రవికుమార్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వంటి వారు ఎక్కడ ఉన్నారో తెలియక అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఈ సిరీస్‌లో తాజా పరిణామాలు. తమ్మినేని వంటి కొందరు నేతలు అత్యంత ప్రయాస పడి మధ్యంతర బెయిల్ తెచ్చుకుంటుంటే.. మిగిలిన వారంతా పోలీసుల భయంతో దిక్కుతోచని స్థితిలో నక్కి నక్కి బతుకుతున్నారు. అసలు ఇక్కడ విచిత్రమేమిటంటే.. పోలీసులు వీరిని అరెస్ట్ చేయడానికి పెద్దగా ప్రత్యేక వేట ఏమీ సాగించడం లేదు. అయినప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనన్న భయంతో ఫోన్లు కూడా వాడకుండా, రహస్య స్థావరాల్లో దాక్కుంటూ నేతలే సొంతంగా నరకం అనుభవిస్తున్నారు. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ఫోన్ లేకుండా, పరివారానికి దూరంగా, నిరంతరం పోలీసుల సైరన్ వినపడితే ఉలిక్కిపడుతూ అజ్ఞాతంలో గడపడం ఏ రాజకీయ నాయకుడికైనా తీవ్రమైన మానసిక వేదన. ముందస్తు బెయిల్ ఇప్పించాలంటూ కోర్టుల చుట్టూ లాయర్లతో పిటిషన్లు వేయిస్తూ, రోజులు లెక్కిస్తూ బతకడం కంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదు. వైసీపీ నాయకత్వం గానీ, ఈ పరారీలో ఉన్న నేతలు గానీ అర్థం చేసుకోవాల్సిన ప్రధానమైన అంశం ఒకటుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నిందితులు ఎంతకాలం పారిపోగలరు? ఎక్కడో ఒకచోట ఫోన్ వాడినా, డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసినా లేదా మూడో వ్యక్తితో మాట్లాడినా పోలీసులు సులభంగా ట్రాప్ చేయగలరు. పోలీసులకు పట్టుబడకుండా శాశ్వతంగా తప్పించుకోవడం అసాధ్యమనే విషయాన్ని గుర్తించకుండా, కోర్టులు ముందస్తు బెయిల్ ఇచ్చే వరకు అజ్ఞాతంలో ఉంటామనడం కేవలం స్వయంకృతాపరాధమే. నిజానికి చట్టాన్ని గౌరవించి ధైర్యంగా వెళ్లి పోలీసుల ముందు లొంగిపోతే .. మహా అయితే రిమాండ్‌కు పంపి జైలులో పెడతారు. కేసు తీవ్రతను బట్టి వారం లేదా పది రోజుల్లో సాధారణ బెయిల్ వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆ చట్టపరమైన మార్గాన్ని వదిలేసి, రోజూ అరెస్ట్ అవుతామేమోనన్న భయంతో ముళ్ల కంచె మీద గుడ్డ వేసుకున్నట్లు పరారీలో రోజులు గడపడం వ్యూహాత్మకంగా పెద్ద పొరపాటు. ఒకవైపు సుప్రీంకోర్టు కూడా తీవ్రమైన ఆరోపణలు, ఆర్థిక నేరాలు ఉన్న కేసుల్లో కస్టడీ విచారణ అవసరమని స్పష్టం చేస్తూ ముందస్తు బెయిళ్లను తిరస్కరిస్తోంది.

# జెన్ జీ టచ్ లో జనసేన

**కాకినాడ, ఆగస్టు 3, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ



వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి. దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు. మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం. రాబోయే కాలంలో జరగబోయే ప్రతి ఎన్నికను సవాల్‌గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జనసేన శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. త్వరలో ప్రకటించబోయే కొత్త రాష్ట్ర కమిటీ జాబితా రాజకీయ వర్గాలలో పెను మార్పులకు కారణం కానుంది. పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు పార్టీని ఏ విధంగా విజయతీరాలకు చేర్చుతాయనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# మళ్లీ వల్లభనేనికి కోర్టు తిప్పలు

**విజయవాడ, ఆగస్టు 3, పెన్ పవర్:**
గన్నవరం నియోజకవర్గ రాజకీయాల్లో మట్టి దోపిడీ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అక్రమాలను ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బహిర్గతం చేయడం పెద్ద చర్చకు దారితీసింది. పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలు, ప్రభుత్వ పనుల కాంట్రాక్టులలో సాగిన అవినీతిని ఆయన బయటపెట్టారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాలనలో జరిగిన ఈ దోపిడీపై విజిలెన్స్ నివేదికలు కూడా స్పష్టమైన నిజాలు వెల్లడించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోట్ల విలువైన సహజ వనరులను తరలించారని ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గ ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతతోనే తాను ఈ నిజాలను బయటపెట్టానని యార్లగడ్డ గట్టిగా చెబుతున్నారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయాల్లో పెను మార్పులకు కారణం అవుతున్నాయి. అక్రమాలు బయటపడతాయనే భయంతో మాజీ ఎమ్మెల్యే వంశీ లీగల్ నోటీసుల మార్గాన్ని ఎంచుకున్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ ఆయన పంపుతున్న నోటీసులు కేవలం భయపెట్టే ప్రయత్నాలని కూటమి శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయాక చట్టపరమైన ముసుగులో తప్పించుకోవాలని చూడటం సరికాదని విమర్శకులు అభిప్రాయపడుతున్నాయి. కోర్టుల ద్వారా భయపెట్టి నోరు మూయించవచ్చనే ఆలోచన కేవలం భ్రమేనని స్థానిక నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఇలాంటి బెదిరింపులకు పాల్పడటం మాజీ ఎమ్మెల్యే రాజకీయ బలహీనతను స్పష్టంగా బయటపెడుతోంది. బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధైర్యంగా ప్రకటిస్తున్నారు. చట్టబద్ధంగా ఏ



వేదికపైనైనా ఈ దోపిడీని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. కోర్టులకు వెళ్తే అసలు నిజాలు, మట్టి తవ్వకాలకు సంబంధించిన పక్కా ఆధారాలన్నీ బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించింది నియోజకవర్గాన్ని ప్రక్షాళన చేయడానికే తప్ప ఇలాంటి లీగల్ నోటీసులకు భయపడటానికి కాదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం ద్వారా ఆయన తన పట్టును నిరూపించుకుంటున్నారు. ఈ రాజకీయ పోరు రానున్న రోజుల్లో మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. గన్నవరం నియోజకవర్గ ప్రజలు గత ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలను నిశితంగా గమనించారు. విమానాశ్రయం పరిసరాల్లో జరిగిన పనులలోనూ భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాయల్టీ చెల్లించకుండా తరలించిన వేలాది ట్రక్కుల మట్టి లారీలు రోడ్లను ధ్వంసం చేశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువత ఈ విషయాలను సోషల్ మీడియా వేదికగా విశ్లేషిస్తూ నిలదీస్తున్నారు. పాత తప్పులను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులు పంపడం పట్ల ప్రజల్లో వ్యంగ్యమైన చర్చ నడుస్తోంది. అభివృద్ధిని విస్మరించి కేవలం అక్రమ సంపాదన మీద దృష్టి పెట్టడం వల్లే నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని యువత భావిస్తున్నారు. ఈ పరిణామాలు రాబోయే రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మొత్తానికి గన్నవరం రాజకీయం ప్రస్తుతం అత్యంత రసవత్తరమైన దశకు చేరుకుంది. యార్లగడ్డ వెంకట్రావు దూకుడు వల్ల వంశీ వర్గంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అవినీతిని అంతం చేసే వరకు విశ్రమించేది లేదనే సంకేతాలను ప్రస్తుత నాయకత్వం బలంగా ఇస్తోంది. సోషల్ మీడియా ట్రెండ్స్ ప్రకారం చూస్తే ఈ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ప్రజలు కూడా నిజాలు ఎటువైపు ఉన్నాయో స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. రానున్న కాలంలో ఈ పోరు కోర్టుల ద్వారా ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. గన్నవరం అభివృద్ధి సాధించాలంటే ఇలాంటి అక్రమాలపై నిరంతరం నిఘా అవసరమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# సొంత జట్టుతో కొట్లాట.. పంజాబ్ కింగ్స్ స్టార్ ప్లేయర్ సంచలన నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో రచ్చ చేసిన పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ శశాంక్ సింగ్ సొంత స్టేట్ టీమ్‌తోనే ఇప్పుడు లొల్లి పెట్టుకొని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. ఛత్తీస్‌గఢ్ స్టేట్ క్రికెట్ సంఘం ) తనకు అస్సలు సపోర్ట్ ఇయ్యలేదని, ఏమాత్రం చెప్పకుండా టీమ్ నుంచి పక్కనబెట్టిందని ఆరోపించాడు. అందుకే ఆ టీమ్‌ను వదిలేసి, వచ్చే 2026-27 డొమెస్టిక్ సీజన్ నుంచి పాండిచ్చేరి తరపున ఆడబోతున్నట్టు చెప్పేసిండు. దీనికి సంబంధించి ఛత్తీస్‌గఢ్ బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ) కూడా తీసుకున్నాడు.

**గాయపడితే పట్టించుకోలే.. అడిగితే అసలు జవాబే లేదు:**

శశాంక్ సింగ్ మాట్లాడుతూ.. గత సీజన్‌లో నాకు భుజం, వేలికి తీవ్ర గాయాలైనయి. ఆ సమయంలో ఛత్తీస్‌గఢ్ క్రికెట్ అసోసియేషన్ నన్ను అస్సలు పట్టించుకోలే, సపోర్ట్ కూడా చేయలే.. గాయం తగ్గినంక కూడా ఛత్తీస్‌గఢ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (జజ్హూా 2026) ప్లేయర్ల లిస్టులకెల్లి నా పేరు తీసేసింద్రు. బెంగళూరుల జరిగిన ప్రీ-సీజన్ క్యాంప్‌కి కూడా నన్ను పిలవలే.. నా పేరు ఎందుకు తీసేసింద్రు? అని అడిగితే అసోసియేషన్ వాళ్లు జవాబు చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేసిండు.

**నేను ఐపీఎల్ మాత్రమే ఆడతాననడం అబద్ధం:**

తాను ఐపీఎల్ ఒక్కటే ఆడడానికే ఇంట్రెస్ట్ చూపిస్తున్నానని, డొమెస్టిక్ మ్యాచ్‌లను లైట్ తీసుకుంటున్నానని వచ్చిన వార్తలను శశాంక్ సింగ్ తీవ్రంగా ఖండించాడు. నేను డొమెస్టిక్ మ్యాచ్‌లు ఆడకుండా కేవలం ఐపీఎల్ ఆడటానికే చూడట్లే.. గత సీజన్ (2023-24 ) లోనే డొమెస్టిక్ వైట్ బాల్ మ్యాచ్‌లలో బెస్ట్ ఆల్‌రౌండర్ ప్రదర్శన ఇచ్చినందుకు బీసీసీఐ నాకే ప్రతిష్టాత్మకమైన లాలా అమర్‌నాథ్ అవార్డు ఇచ్చింది. ఇండియాలోనే బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచినా నేను డొమెస్టిక్ ఆడా అనడం ఏంది? అని ప్రశ్నించాడు.

**డొమెస్టిక్, ఐపీఎల్‌లో మాస్ రచ్చ:**

గత కొంతకాలంగా దేశవాళీ మ్యాచ్‌లలోనూ, ఐపీఎల్‌లోనూ శశాంక్ కిర్రాక్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నాడు.

2024--25 డొమెస్టిక్ రికార్డు: విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌లలోనే 450 రన్స్, 11 వికెట్లు తీసిండు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 7 మ్యాచ్‌లలో 188 రన్స్ కొట్టిండు.

ఐపీఎల్ 2025లో విధ్వంసం: పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 ఫైనల్‌కి పోవడంలో శశాంక్ కీలక పాత్ర పోషించాడు. 153.51 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 350 రన్స్ కొట్టిండు. బెంగళూరుతో జరిగిన ఫైనల్లోనైతే కేవలం 30 బంతుల్లో 61 రన్స్ (నాటౌట్)తో చెలరేగాడు.

**పాండిచ్చేరితో కొత్త ఇన్నింగ్స్:**

వచ్చే సీజన్ నుంచి రెడ్-బాల్ (రంజీ) క్రికెట్‌కి కొద్దిగా గ్యాప్ ఇచ్చి, వైట్-బాల్ (ы20, жаణ×) ఫార్మాట్‌పైనే పూర్తి ఫోకస్ పెట్టాలని శశాంక్ సింగ్ ఫిక్స్ అయ్యాడు. టీ20ల్లో తన 4 ఓవర్ల కోటా పూర్తిగా బౌలింగ్ వేసే పక్కా ఆల్‌రౌండర్‌గా నిలబడాలనేదే తన మెయిన్ గోల్ అని చెప్పిండు. 2018ల ముంబైని వదిలేసి మంచి ఛాన్స్‌ల కోసం ఛత్తీస్‌గఢ్‌కు వచ్చిన శశాంక్, ఇప్పుడు ఆ అసోసియేషన్‌తో గొడవపడి బయటికొచ్చి పాండిచ్చేరి జట్టుతో తన డొమెస్టిక్ కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ స్టార్ట్ చేయబోతున్నాడు.

# భారత జట్టుతో నా ఐదేళ్ల ప్రయాణం ముగిసింది.. ఈ జ్ఞాపకాలని జీవితంలో మార్చిపోలేను



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు సక్సెస్‌లో కీలక పాత్ర పోషించిన ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ తన పదవీకాలానికి ముగింపు పలికారు. జింబాబ్వే పర్యటనతో ఆయన కాంట్రాక్ట్ పూర్తి కావడంతో, టీమిండియాతో ఐదేళ్ల అనుబంధానికి తెరపడింది. ఈ నేపథ్యంలో ఈరోజు (ఆగస్టు 3న, సోమవారం) ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ లేఖను విడుదల చేశారు. జట్టుతో తన ప్రయాణం ఎంతో గొప్పగా కొనసాగింది, ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. నవంబర్ 2021లో భారత ఫీల్డింగ్ కోచుగా బాధ్యతలు చేపట్టిన దిలీప్.. జింబాబ్వే పర్యటనతో తన కాంట్రాక్ట్ ముగియడంతో జట్టు నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో శుభదీప్ ఘోష్ కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఐదేళ్లు ఎంతో అర్ధవంతమైన ఈ ప్రయాణానికి సరైన మాటలు దొరకడం లేదు.. నేను ఈ సెటప్‌లోకి అడుగు పెట్టినప్పుడు ప్రతిరోజూ నా వంతుగా 100 శాతం ఇవ్వాలనే ఒక్కటే లక్ష్యంతో వచ్చానని వెల్లడించారు.

**ప్రత్యేక ఆకర్షణగా ఫీల్డింగ్ మెడల్ ట్రెండ్:**

డ్రెస్సింగ్ రూమ్‌లో మ్యాచ్ తర్వాత ఉత్తమ ఫీల్డర్‌కు ఇచ్చే ఫీల్డింగ్ మెడల్ ఆచారాన్ని టి. దిలీప్ ప్రారంభించారు. ఇది ఆటగాళ్లలో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు జట్టులో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో ఈ సంప్రదాయం ఎంతగానో ప్రాచుర్యం పొందింది. ఈ అనుభూతిని గుర్తు చేసుకుంటూ.. ఫీల్డింగ్ మెడల్ నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానంలో ఉంటుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో అది సృష్టించిన ఉత్సాహం, ఆటగాళ్లు దానికి ఇచ్చిన విలువ ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పుకొచ్చాడు.

**అరుదైన విజయాలకు వేదిక:**

తన ఐదేళ్ల పదవీకాలంలో టీమిండియా సాధించిన అద్భుత విజయాలను దిలీప్ గర్వంగా గుర్తు చేసుకున్నారు.

2024 , 2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయాలు

2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపు,

2023 , 2025 ఆసియా కప్ విజయాలు

2023 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్ రన్నరప్స్

**ప్రత్యేక కృతజ్ఞతలు:**

బీసీసీఐతో పాటు తనతో కలిసి పని చేసిన ప్రతి ఒక్కరికీ దిలీప్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు బీసీసీఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. అలాగే, రాహుల్ ద్రావిడ్, గౌతమ్ గంభీర్‌లు తనపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు చెప్పాడు.

ఇక రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లతో పని చేయడం తన అదృష్టమన్నారు. ఈ అధ్యాయం ముగిసినా, భారతదేశ జెర్సీని ధరించి దేశానికి సేవ చేసిన ఈ ఐదేళ్లు నా జీవితంలో ఎప్పటికి మరువలేని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.. భారత్ మాతా కీ జై! అంటూ తన సందేశాన్ని మాజీ ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ ముగించాడు.

# భారత జట్టులో వరుస గాయాలతో ఆందోళన.. శ్రీలంక టూర్ తర్వాత బీసీసీఐ రివ్యూ



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక జట్టుతో ఆగస్టు 15వ తేదీ నుంచి జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం తీవ్రమైన గాయాల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుండగా.. కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా దూరమవడం జట్టును తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

**గాయాల బారిన పడ్డ కీలక ప్లేయర్స్:**

ఇప్పటికే హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా లాంటి ఆటగాళ్లు గాయాల కారణంగా టీమిండియాకు దూరంగా ఉండగా.. తాజాగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా మోకాలి గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. ప్లేయర్స్ వరుస గాయాలు కెప్టెన్, కోచ్‌లకు తుది జట్టును ఎంపిక చేయడంలో తీవ్ర తలనొప్పిగా మారింది.

**ఫిజియో, డాక్టర్లపై బీసీసీఐ నిఘా:**

ఆటగాళ్లు తరచూ గాయ పడుతుండటంపై బీసీసీఐ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. జట్టు ప్రధాన ఫిజియో కమలేశ్ జైన్, డాక్టర్ రిజ్వాన్ ఖాన్ ల పని తీరుపై బోర్డు దృష్టి పెట్టింది. బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ నిపుణుల పాత్రపై కూడా సమీక్ష జరుపుతున్నట్లు సమాచారం. ఒక జట్టులో ప్రతి స్థానానికి తీవ్రమైన పోటీ ఉన్నప్పుడు, ఆటగాళ్లు తమ శరీరాన్ని కష్టపెట్టాల్సి వస్తుంది. ఇక్కడే సపోర్ట్ స్టాఫ్, జశీజు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్లేయర్స్ ను తొందరగా బరిలోకి దింపకుండా అలర్ట్ చేయాలి.. కానీ ప్రస్తుత పరిస్థితి ఇబ్బందికరంగా మారింది, బాధ్యులందరినీ జవాబుదారీగా చేయాలని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి.

**డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే:**

ప్రస్తుత టెస్ట్ సిరీస్ భారత్‌కు అత్యంత కీలకం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) ఫైనల్ రేసులో నిలవాలంటే.. భారత్ ఆడబోయే తదుపరి 9 టెస్టుల్లో కనీసం 7,8 మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యంగ్ టీమ్ ఈ లంక పర్యటనలో ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడాల్సి ఉంది.



తమన్నా భాటియా యొక్క ర్యాంప్ వాక్ యొక్క థ్రిల్ అనుభూతి చెందండి

# టాలీవుడ్ లో లక్కీలేడీగా మారిన మిరాయ్ బ్యూటీ.. ఆ అదృష్టం వరిస్తుందా?



టాలీవుడ్‌కి అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో పరిచయమై, ఆ తర్వాత వచ్చిన 'మిరాయ్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకుంది యంగ్ హీరోయిన్ రితిక నాయక్ రెండు వరుస హిట్లతో ఇండస్ట్రీలో లక్కీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు ఆమె వరుణ్ తేజ్‌తో కలిసి 'కొరియన్ కనకరాజు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది.. మరి ఈ సినిమాతో ఆమె హ్యాట్రిక్ కొట్టి, అదృష్టాన్ని అందిపుచ్చుకుంటుందా? అటు వరుణ్ తేజ్‌కు కూడా విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి..

**తొలి సినిమాతోనే మంచి గుర్తింపు:**

రితిక నాయక్ తన కెరీర్ ప్రారంభంలోనే సరైన కథను ఎంచుకుంది. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాలో ఆమె నటనకు, అందానికి మంచి మార్కులు పడ్డాయి. బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా మంచి విజయం సాధించడంతో, అందరి దృష్టి రితికపై పడింది.

**'మిరాయ్'తో దక్కిన మరో ఘనవిజయం:**

మొదటి సినిమా హిట్ అయిన తర్వాత వచ్చిన 'మిరాయ్' మూవీ కూడా భారీ విజయాన్ని అందుకుంది. దీంతో మొదటి రెండు సినిమాలతోనే వరుసగా రెండు హిట్లు తన ఖాతాలో వేసుకుంది రితిక. అలాగే 'హాయ్ నాన్న'లో ఆమె చేసిన చిన్న మెరుపు లాంటి రోల్ కూడా కుర్రకారును బాగా ఆకట్టుకుంది.

**సినిమాల మధ్య పెద్ద గ్యాప్:**

ఇంత మంచి గుర్తింపు వచ్చినా, రితిక వరుసగా సినిమాలు సంతకం చేయకపోవడం కాస్త మైనస్ అనే చెప్పాలి. ఇక ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే ఎప్పుడూ వార్తల్లో, స్క్రీన్ మీద కనిపించడం చాలా అవసరం. ఈ పెద్ద గ్యాప్ వల్ల ఆమె కెరీర్ వేగం కాస్త తగ్గుతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

**హ్యాట్రిక్ కొట్టే రేర్ చాన్స్:**

ఇప్పుడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వస్తున్న 'కొరియన్ కనకరాజు' సినిమాలో రితిక హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా కూడా హిట్ అయితే, కెరీర్ ప్రారంభంలోనే వరుసగా మూడు హిట్లు కొట్టిన అరుదైన నాయికగా రితిక చరిత్ర సృష్టిస్తుంది. మరి ఆ అదృష్టం ఆమెను వరిస్తుందో లేదో మూవీ రిలీజ్ తో తేలనుంది.

**వరుణ్ తేజ్‌కి లక్ కలిసి వస్తుందా?:**

మరోవైపు, హీరో వరుణ్ తేజ్‌కి ఈ సినిమా విజయం చాలా కీలకం. సరైన హిట్ కోసం చూస్తున్న వరుణ్‌కి, లక్కీ చార్మ్‌గా మారిన రితిక నాయక్ అదృష్టం ఏ మేరకు కలసివస్తుందో చూడాలి. ఈ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్ సక్సెస్ సాధిస్తుందో త్వరలోనే తేలనుంది.మొత్తానికి ఆగస్టు 7న విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' చిత్రం రితిక నాయక్ కెరీర్‌కి చాలా ప్లస్ అయ్యేలా కనిపిస్తోంది. మరి ఈ 'మిరాయ్' బ్యూటీ తన లక్ తో ఇటు తనకు హ్యాట్రిక్ హిట్ ఇస్తూ, అటు వరుణ్ తేజ్‌కు కూడా సక్సెస్ అందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే!..



ప్రకృతి పావని నెయిల్స్ బ్రౌన్ లాంగ్ స్లీవ్ లుక్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965